బీదర్, పద్మావతి రైలులో దొంగలు

ఎస్-4, 9, 10 బోగీలలో చోరీ

● బంగారు గొలుసుల అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న పద్మావతి, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్- 4,9,10 బోగిలోని ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఈ ఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్- 4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికులు మెడలలోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి అనే మహిళ మెడలో 4 గ్రాములు బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాములు బంగారు గొలుసు, జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ.13 వేల నగదు కిటికీల నుంచి ఎత్తుకెళ్లిపోయారు. బాధిత ప్రయాణికులందరూ గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదుల చేశారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పి పోలీసులు ఖమ్మం జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు. సిగ్నల్ కట్ చేసి రైళ్లలో దోపిడికి పాల్పడినట్లు విచారణలో తెలిసింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంకు చెందిన కోడారి కాంతారావుకు అత్యవస వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.2లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ వరమని అన్నారు.

బస్సు సౌకర్యం ... ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్‌కాలనీకి బస్సు సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్‌బెస్టాస్ కాలనీ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు 41సీ నెంబర్‌తో బస్సు సౌకర్యం కల్పించడంలో ఎమ్మెల్యే చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరేష్, నర్సింహులు, మహ్మద్ హుస్సేన్, ఎంఏ.రఫిక్, పుష్ప, అబ్దుల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

పేట్‌బషీరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసం వద్ద కుత్బుల్లాపూర్ సంక్షేమ సంఘం సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్ఎస్‌రెడ్డి నగర్‌లోని కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తు కోసం నిధులు మంజూరు చేయాలని సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, శాధికారి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంపెనీ అభివృద్ధికి కార్మికులు కృషి చేయాలి: కూన

గాజులరామారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కార్మికులు భాగస్వాములు అయినప్పుడే కంపెనీ అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. దుండిగల్ డీపోచంపల్లిలోని ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీలోని నూతనంగా ఎన్నికైన ఐఎన్‌టీయూసీ యూనియన్ సభ్యులు గురువారం శ్రీశైలంగౌడ్‌ను నివాసంలో కలిశారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు రామ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మెరుగుపడింది

బాలానగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతోనే ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన మెరుగు పడిందని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం బాలానగర్ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ప్రతిభావంతులకు బహుమతులు, నగదు పురస్కారాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అరుణ్‌జ్యోతి, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎలిజాల యాదగిరి, ఖాజ, శ్రీనివాస్‌ముదిరాజ్, నాగేందర్, సోఫీ, రాము, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్లకు నష్టం జరగకుండా రిటర్నింగ్ వాల్ నిర్మించాలి

ఫతేనగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాలా రిటర్నింగ్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పనులకు ఆటంకం కల్గించకుండా సహకరించాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సూచించారు. డివిజన్ పరిధి జింకలవాడలో రూ.90 లక్షలతో చేపట్టిన నాలా రిటర్నింగ్ వాల్ పనులను మూసాపేట్ సర్కిల్ డీఈ శ్రీదేవి, డివిజన్ ఏఈ పవన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనుల్లో స్థానికుల ఇళ్లకు నష్టం జరగకుండా పనులు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాజూ, సుదర్శన్‌రెడ్డి, బాల నర్సింహ్మలు, రాములు, అంజి, వెంకటేష్, ఫిరోజ్, సాయి, యాదగిరి పాల్గొన్నారు.

సమాజ సేవకు రాజకీయాలు, పదవులు అక్కర్లేదు

ఓల్డుబోయినపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేసేందుకు రాజకీయాలు, పదవులు అక్కర్లేదని సేవ చేయాలనే తపన, సహృదయం ఉంటే చాలని ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్ అన్నారు. బుధవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ ముదిరాజ్ మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవంలో కూకట్‌పల్లి అధ్యక్షుడు పిట్ల రాజు ముదిరాజ్‌కు అసోసియేషన్ నుంచి శ్రీమహానంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజును శాలువా పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మన్నె ఉదయ్‌కుమార్, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, మల్లేష్‌యాదవ్, శ్రీశైలం, పోచయ్య, ఉమ, అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.

సాయినాగేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు

బాలానగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బాలానగర్ సాయినాగేంద్ర ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారరు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు భోజనాలు, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బాలిక ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక ఆత్మ హత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ ధర్మేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా, టంగుటూరి మండల, కందులూరిగ్రామానికి చెందిన కంభం శివనాగరాజు కుటుం సభ్యులతో 20 సంవత్సరాల కితం వలస వచ్చి నగర శివారులోని దూలపల్లి రామచంద్రా నిలయంలో నివాసం ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. శ్రీభవ్య(15) సొంతూరులో పదోతరగతి ఉత్తీర్ణత పొంది, 10 రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. గురువారం తల్లిదండ్రులు ఇంట్లో లేనిసమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మైనర్ వాడే సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఎర్రాకుల రవి

హైదర్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఎర్రాకుల రవి(50) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం కూకట్‌పల్లి అడ్డగుట్టలో ఓ భవనం నిర్మాణం నిమిత్తం సెంట్రింగ్ పనుల కోసం వచ్చాడు. పనులు పర్తైన తర్వాత అక్కడి నుంచి వెళ్లాడు. కానీ ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ అడ్డగుట్టకు చేరుకుని పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు గురువారం కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల్లేవ్..!

● అయినా ఆగని అక్రమ నిర్మాణాలు

● నోరుమెదపని టౌన్‌ప్లానింగ్ విభాగం

● అక్రమార్కులకు అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు

అనుమతులు లేకుండానే.. అదికూడా 30ఎకరాల సీలింగ్ భూమిలో అక్రమభవనాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఆదిలోనే అడ్డుకోవాల్సిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది 4, 5 అంతస్తుల నిర్మాణం పూర్తయిన తరువాత, అదికూడా ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా అక్రమనిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ మున్సిపల్ సిబ్బంది విధిలేని పరిస్థితుల్లో నోరుమూసుకుని వెనుతిరుగుతున్నారు. దుండిగల్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక కథనం..



168 సర్వేనెంబరులో 400 గజాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న నాలుగు ఫ్లోర్ల నిర్మాణం



ఎస్‌బీఐ బ్యాంక్ వెనుక రోడ్డులో 90 గజాల్లో నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవనం

దుండిగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లి గ్రామం పరిధిలోని సర్వేనెంబర్ 168లో 30ఎకరాలకుపైగా ప్రభుత్వరికార్డులో సీలింగ్ భూమిగా చూపిస్తుంది. ఇక్కడ నిర్మాణ దారులకు మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వరు. టీఎస్ బిపాస్ ద్వారా అనుమతులు తెచ్చుకుందాం అన్నా అక్కడ కూడా ఇవ్వరు. దీంతో ఎప్పుడో గతంలో ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు కనీస అనుమతులు లేకుండా అడ్డగోలు నిర్మాణాలకు తెరలేపారు. 80 నుంచి 100, 120, 150గజాల్లో కూడా నాలుగు నుంచి ఏడు అంతస్తుల నిర్మాణాలను బాహటంగా చేపడుతున్నారు. ఇదేమని మున్సిపల్ అధికారులు ప్రశ్నిస్తే 'మాకు ఇక్కడ అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో అధికారులకు అంతో ఇంతో ముట్ట చెబుతున్నాం' అని అంటున్నారు. ఇలా విచ్చలవిడిగా భవనాలు నిర్మిస్తున్నారు. 80 నుంచి 100, 150 గజాల లోపు ఇళ్లను నిర్మించుకునే వారు టీఎస్‌బీపాస్ కింద అనుమతి తీసుకోవాలంటే రూ.1లక్ష నుంచి 1.5 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనుమతికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ప్లాట్లు ఉన్నవారికి ఈసర్వేనెంబరు మొత్తం సీలింగ్ కింద ఉన్నది. కాబట్టి అనుమతులు ఇవ్వరు. దీంతో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో కొంత ముట్ట చెబుతూ ఇలా విచ్చలవిడి నిర్మాణాలకు తెరలేపుతున్నారు.

కేటీఆర్ హామీ.. అతీగతీలేదు

దుండిగల్ మున్సిపాలిటీకి నాలుగు సంవత్సరాల క్రితం నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించడానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌లు 168 సర్వేనెంబరులో ఉన్న 30 ఎకరాలు పూర్తిగా ప్రైవేట్ స్థలమేనని, గతంలో లే-అవుట్ చేసి ప్లాట్లు విక్రయించారని, ఈ స్థలంలో కేవలం 18 గుంటలు సీలింగ్ ఉందని చెప్పారు. దీనివల్ల ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకోలేక పోతున్నామని, జిల్లా అధికారులు ఈ విషయంపై పరిశీలించి, ఈ స్థలానికి అనుమతులు వచ్చేలా చూడాలని మాజీ మంత్రిని కోరారు. దీనికి సంబంధించిన విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తానని మాజీ మంత్రి హామీ ఇచ్చారు. ఆ హామీ హామీగానే మిగిలి పోయింది. ప్లాట్ల యజమానులు మాత్రం కనీసం అనుమతులు లేకుండా భారీ భవనాలను నిర్మిస్తున్నారు. అధికారులు అనుమతులు లేని నిర్మాణాలను కూల్చడానికి వెళితే స్థానిక కౌన్సిలర్లతోపాటు ప్రజాప్రతినిధులు కూడా అడ్డుకుంటూ, అటు వైపు కూల్చివేతలు చేపట్ట వద్దని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేట్, బౌరంపేట్, దొమ్మరపోచంపల్లి, బహదూర్‌పల్లి, గాగిళ్లాపూర్, దుండిగల్ గ్రామాల్లో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను ఎప్పటికప్పుడు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేపడుతున్నారు. దొమ్మరపోచంపల్లి సర్వేనెంబరు 168లో సీలింగ్ ల్యాండ్ ఉంది. కాబట్టి ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులూ రావు. అయినా కొందరు విచ్చలవిడిగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. అడ్డుకుంటే ప్రజాప్రతినిధులతో బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ సర్వే నెంబరు మీద అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న భవనాలపై రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

- సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్, దుండిగల్


ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి



కూకట్‌పల్లి జెడ్‌సీతో సమావేశమైన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్, నాయకులు

కూకట్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషిచేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో గురువారం ఆయన జెడ్సీ అభిలాష అభినవ్‌తో సమావేశమయ్యారు. వర్షాకాలం సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నాలాలను శుభ్రంగా ఉంచడం, వర్షపునీరు పొంగి కాలనీల్లోకి రాకుండా రిటర్నింగ్ వాల్స్ నిర్మించడం, నాలాలపై శ్లాబులు వేయడంపై దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా కూరగాయల మార్కెట్ల వద్ద చెత్త తరలింపు, కాలనీల్లో పారిశుధ్య నిర్వహణపై చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిధుల కొరత ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తామని బండి రమేష్ తెలిపారు. కాలనీ అసోసియేషన్ల సంఘాలు సహకరిస్తే త్వరగా ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, తూము వేణు, నాగిరెడ్డి, దినేష్, సంజీవరావు, పుష్పారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

అడవుల రక్షణలో అటవీ శాఖాధికారుల పాత్రముఖ్యం



శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో ఎస్‌జే ఆషా

పేట్‌బషీరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇతర ప్రభుత్వ సేవవలే కాక అటవీశాఖ ఉద్యోగాలు ప్రత్యేకమైనవి అని తెలంగాణ అటవీ అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా అన్నారు. దూలపల్లి అటవీ అకాడమీలో 22వ బీట్ అధికారుల స్నాతకోత్సవం గురువారం జరిగింది. ఈ శిక్షణలో 16 మందిలో ఐదుగురు మహిళా అధికారులు ఉన్నారు. శిక్షణా కార్యక్రమం పరీక్షల్లో సెక్షన్ అధికారులు ఐదుగురు గౌరవ శ్రేణిలో, 10 మంది ఉన్నత శ్రేణిలో, ఒకరు దిగువ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా, మహాదేవ్‌పూర్ అటవీ డివిజన్‌కు చెందిన టి.వినోద్ కుమార్ అత్యధికంగా ఐదు బంగారు పతకాలను సాధించారు. అదిలాబాద్ అటవీ డివిజన్‌కు చెందిన బి.సరిత 3, జి.శ్రీనివాస్ 2 , ఎస్‌కే నహదాపర్వీన్, కె.అరిస్టాటిల్, ఎస్.శ్రీకాంత్, పి.మమతలు ఒక్కొక్కటి బంగారు పతకాలను సాధించారు. వీరికి ఎస్‌జే ఆషా, అదనపు సంచాలకులు రమేష్, శిక్షణాధికారుల కోర్సు డైరెక్టర్ ఎస్‌పి నాగినిభాను పతకాలను అంజేశారు.

పిల్లల్లో స్ఫూర్తికి మీ విజయాలు దోహదపడాలి



సీపీ అవినాష్ మహంతి, సినీనటి రెజీనా

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో స్ఫూర్తికి మీ విజయాలు దోహదపడాలని పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. దివ్యాంగులైన పిల్లల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఆదిత్య మెహతా ఫౌండేషన్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జేఎన్‌వీ రంగారెడ్డి క్యాంపస్‌లో పారా స్పోర్ట్స్ ప్రతిభ గుర్తింపు శిక్షణ శిబిరాన్ని సైబరాబాద్ పోలీస్‌కమిషనర్ అవినాష్‌మహంతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో చాలా ప్రతిభ దాగి ఉందన్నారు. సినీనటి రెజీనా కసాండ్రా మాట్లాడుతూ పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేయాలన్నారు. సంకల్పం ఉంటే ఏదైన సాధించవచ్చన్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ కోచ్, ఫౌండర్ ఆదిత్య మెహతా మాట్లాడుతూ పారా ఒలింపిక్స్‌లో మన దేశానికి 100కి పైగా పతకాలు సాధించడమే లక్ష్యమన్నారు. ఈ శిబిరం ద్వారా యూత్ ఏషిన్ గేమ్స్ 2025, పారా ఒలింపిక్స్ 2028 లక్ష్యం అని తెలిపారు.



ఆందోళనకారులతో కలిసి మాట్లాడుతున్న ఆంజనేయులు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆందోళన

దుండిగల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట అవుటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ కారణంగా రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోందని, ఈ విషయమై మల్లంపేట చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసులందరూ గురువారం ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు స్థానిక నాయకులు ఆంజనేయులు, మోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జిట్ మా గ్రామానికి వచ్చినందుకు సంతోషంగా ఉంది కానీ పెరిగిన జనాభా కారణంగా ట్రాఫిక్ జఠిలంగా మారిందన్నారు. 100ఫీట్ల రోడ్డు కోసం మల్లంపేట గ్రామ మధ్యలో నుంచి ప్రణాళికను అధికారులు రూపొందించారు. దీంతో గ్రామంలో ఉన్న పేదలు ఇళ్లు కోల్పోవాల్సి వస్తోందని, దీనిని తాము అంగీకరించేది లేదని అన్నారు. పాత హైదారాబాద్ రోడ్డు పూర్తిగా ప్రభుత్వ స్థలం నుంచే వెళుతుంది కాబట్టి, అక్కడ ఎవ్వరికీ నష్ట పరిహారం ఇచ్చేది ఉండదన్నారు. ఈ రోడ్డు రూట్‌ను పాత హైదారాబాద్‌కు మారిస్తే బాగుంటుందన్నారు. అప్పుడు 100ఫీట్ల రోడ్డు ఏర్పడుతుందన్నారు. మల్లంపేట్‌లో రోడ్డు వెడల్పు చేయాలంటే మాత్రం ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

● నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపెన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇండ్యూవిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావి తరుణ్ ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో నలుగురు సభ్యులతో కలిసి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపి, అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. వారు రావి తరుణ్‌తో సహా మరో ముగ్గురిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు, భారతి సంతతికి చెందిన చాలామంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశీ సమూహాలపైన నిఘాపెట్టి వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రారంభంలో అమెరికా పరిశోధన కేంద్రాల్లో నిమగ్నమై ఉన్న టెక్నాలజీ క్రమంగా అమెరికా ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేటర్ శక్తులకు అవసరంగా మారిందన్నారు. ఈ సమస్యపై అందరికి అవగాహన కల్పించి జాగృతం చేయడమే తమ లక్ష్యమని తరుణ్ పేర్కొన్నారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సింగ్రోమ్, సింథటిక్ టెలిపతి గురించి ఎవరికి వారు పరిశోధన జరిపి నిగ్గుతేల్చుకుని వినాశనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పోలీసు అరెస్టులు తమ కార్యక్రమాన్ని ఆపవని, భవిష్యత్‌లో పలు సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని అన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై వారిని వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపారు.

'గమ్యం'తో 2,800 బస్సుల అనుసంధానం

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.

చెరువు స్థలాలను పర్యవేక్షించాలి : కలెక్టర్

గచ్చిబౌలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విలువైన చెరువు స్థలాల పర్యవేక్షణ కోసం అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రంగారెడ్డి కలెక్టర్ శశాంక్ అన్నారు. చెరువు పర్యవేక్షనకు నియమించిన అధికారులు విధిగా తమ పరిధిలోని చెరువులను పరిశీలించాలన్నారు. గురువారం శేరిలింగంపల్లిజోనల్ కార్యాలయంలో చెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ, ఇరిగేషన్‌శాఖ అధికారులతో జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చెరువుల సంరక్షణ కమిటీలతో ఎప్పటికప్పుడు జోనల్ అధికారులు సమీక్షలు నిర్వహించి క్షేత్రాస్థాయి పరిస్థితులు తెలుసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు, చెరువుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొస్టేట్ ఇబ్బందులకు 'రెజమ్ వాటర్ వేపర్ థెరపీ' చెక్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మూత్ర విసర్జన నొప్పి సమస్యను ఎదుర్కొంటున్న ఓ వృద్ధుడికి యశోద ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స లేకుండా ఆధునిక విధానంలో వైద్య ప్రక్రియను నిర్వహించి సమస్యకు చెక్ పెట్టారు. సోమాజీగూడలోని యశోదఆస్పత్రిలో యూరాలజీ విభాగంలో రెజమ్ వాటర్ వేపర్ థెరపీ'ని ఇటీవల విజయవంతంగా నిర్వహించారు. ఈ తరహా ప్రక్రియ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని ఆస్పత్రి వైద్యులు వివరించారు. కామారెడ్డికి చెంది ఎస్.అంజాగౌడ్(68) అనే రైతు కొన్ని వారాలుగా మూత్ర విసర్జన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన సీనియర్ యూరాలజిస్టు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ వి.సూర్యప్రకాష్‌ను సంప్రందించారు. పరీక్షలు నిర్వహించి, బ్లాకేజ్ సమస్యగా నిర్ధారించారు. దీనిని రెజమ్ వాటర్ వేపర్ థెరపీ' ద్వారా తొలగించామన్నారు. ఈ చికిత్స తర్వాత అదే రోజు ఇంటికి వెళ్లవచ్చని డాక్టర్. వి.సూర్యప్రకాష్ చెప్పారు.

వర్షాకాలం ఇక్కట్లపై అప్రమత్తంగా ఉండండి

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముమ్మరంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్యాంపస్ విద్యార్థులకు ఎటువంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో గురువారం జరిగిన సమీక్షలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ప్రధానంగా ఈదురు గాలులకు చెట్లకొమ్మలువిరిగి రాకపోకలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందున అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండాచర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచేలా కిందిస్థాయి సిబ్బందిని పురమాయించాలని ఆదేశించారు. సమావేశంలో వర్సిటీ రెక్టార్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి, యూనివర్సిటీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీబీటీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ : సీపీ

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంటల్ టెస్ట్ మే 2024లో భాగంగా నిర్వహించే కంప్యూటర్ బేసిక్ టెస్ట్ (సీబీటీ) పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీచేశారు. ఈనెల 13 నుంచి 21 వరకు 17వ తేదీ మినహాయించి సీబీటీ పరీక్ష కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకంటే ఎక్కవ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

జీడిమెట్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పేదవిద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. చింతల్ లోని ఓ కన్వెన్షన్‌లో షాపూర్‌నగర్ క్షత్రీయ సమాజ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

టార్గెట్ 1.8లక్షలు

●నాటేందుకు మొక్కలు సిద్ధం

● ఈనెల 15 నుంచి ప్రారంభం



నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

పేట్‌బషీరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేసించిన లక్ష్య సాధనకు కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మున్సిపల్ పరిధిలో లక్షా ఎనభై వేల మొక్కలను నాటాలనే లక్ష్యంతో మున్సిపల్ ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టారు. ఇళ్లలో మొక్కలు పెంచుకునేందుకు జామ, నిమ్మ, మునగ, గన్నేరు, వెలగ, కానుగ, తంగేడు, కర్వేపాకు, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఈసారి నాటే మొక్కలను భవిష్యత్‌లో నరికి వేసే అవసరం రాకుండా ఉండాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈనెల 15 నుంచి మొక్కలు నాటనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా, ఇంటికి రెండు చొప్పున మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందరినీ భాగస్వాములను చేస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: ఐక్యవేదిక

దుండిగల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కులగణన చేపట్టి బీలకు 42 శాతానికి రిజర్వేషన్లను పెంచాలని బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు ఆరే.మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. కొంపల్లిలోని బీసీ ఐక్య వేదిక కార్యాలయంలో గురువారం విలేకర్లుతో మాట్లాడుతూ కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని సీఎంను కోరారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆరే.దశరథం, గ్రేటర్ ప్రధానకార్యదర్శి రంగు కాంత్రిగౌడ్, రంగారెడ్డి జిల్లా బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు జంగిల్ నిఖిల్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అఖిల్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఉన్నారు.